క్లుప్తంగా

రంగస్థల కళాకారులకు సన్మానం



అమరావతి: శాస్త్రీయ సంగీత పరిజ్ఞానంతో నాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కళాకారుడు శక్తి వంచన లేకుండా కషి చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరావటం రామకృష్ణ అన్నారు. సోమవారం భోగి పండగ సందర్భంగా నాట్య మండలి కార్యాలయంలో కళాకారుల సన్మాన సభ నిర్వహించారు. రంగస్థల నటులు జాస్తి సత్యమూర్తి, సాయి నటరాజ నాట్యమండలి వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు చిక్కాల ఉదయశేఖర్, హార్మోనిస్టు గుంటూరు రాజును ఘనంగా సన్మానించారు. సమాజాన్ని మేల్కొలిపే ప్రక్రియలో భాగంగా వినోదం, వికాసం, విజ్ఞానాన్ని సంపూర్ణంగా అందించాలంటే కళలకు, కళాకారులకు సమాజం ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా రామకృష్ణ కోరారు. రంగస్థల కళాకారులు మాదాసు ఆంజనేయులు, ఎస్కే మస్తాన్, ఎస్కే హుస్సేన్ వీర రాఘవయ్య, సాంబాబు, సీహెచ్ హనుమంతరావు, బి.రామయ్య, సీపీఐ అమరావతి కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు

క్రోసూరు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షు శిఖా శాంసన్ ప్రజలకు, ఉద్యోగులకు సోమవారం సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలతో, భోగ భాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని ఆకాంక్షించారు.

మోహినీ అవతారంలో శ్రీమహావిష్ణువు



అచ్చంపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక సీతారామస్వామి దేవాలయంలో మోహినీ అవతారంలో శ్రీమహా విష్ణువు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు, లలిత సహస్ర నామార్చనలు చేశారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

18న పెదపాలెంలో పద్య పఠన పోటీలు

అచ్చంపేట: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా మండలంలోని పెదపాలెంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఈ నెల 18న పౌరాణిక పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నీలం వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్కరు 5 నిమిషాల వ్యవధిలో రెండు పద్యాలు పాడే అవకాశం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల పోటీలు ప్రారంభమవుతాయని, ప్రథమ, ద్వితీయ, తృతీయ రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులుగా రూ.500 లెక్కన ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచినవారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



దొడ్లేరు(క్రోసూరు): సంక్రాంతి పండగ సందర్భంగా దొడ్లేరు గ్రామంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 60మంది పాల్గొనగా.. నలుగురిని విజేతలుగా ప్రకటించారు. మొదటి బహుమతి ప్రవల్లిక (రూ. 10,116) ద్వితీయ బహుమతి సీతాలక్ష్మి (రూ.8,016), తృతీయ బహుమతి త్రివేణి (రూ.5,016), నాలుగో బహుమతి శివపార్వతి(రూ.3.016)కి ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతగా మున్నంగి పద్మలత వ్యవహించారు. పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. మొగల్ జాను బ్రదర్స్ ఆధ్వర్యంలో ఎస్ఐ.నాగేంద్ర రావు బహుమతులు అందజేశారు. చందు, దాచేపల్లి సైదా, బాషా, విజ్ఞాన్ మస్తాన్ వలి, శ్రీను, అలీసా, విష్ణుమూర్తి, హనుమతురావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శావల్యాపురంలో క్రికెట్ పోటీలు

శావల్యాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో గ్రామస్థాయిలో క్రికెట్ టోర్నమెంటు పోటీలు నిర్వహించినట్లు కాకతీయ యూత్ కమిటీ ప్రతినిధి చెరుకూరి బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడాలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నాడు విషం చిమ్మి..నేడు భుజానికెత్తుకుని..!

- ఏపీ రీసర్వే ప్రాజెక్ట్ పేరుతో భూ సర్వే తిరిగి ప్రారంభం
- ఎన్నికల ముందు రీ సర్వేపై విషం చిమ్మిన కూటమి పార్టీలు
- ప్రజల్లో భయాందోళనలు పుట్టించి రాజకీయ లబ్ధి పొందిన వైనం
- నేడు అదే రీ సర్వేను పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం



అందుకూరు గ్రామంలో హద్దుల గుర్తింపులో పాల్గొన్న సర్వేయర్లు

క్రోసూరు: బ్రిటీష్ కాలంలో జరిగిన భూముల సర్వే ద్వారా తలెత్తుతున్న వివాదాలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర భూసర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భూ సరవేపై గత ఎన్నికల్లో కూటమి పార్టీలు విస్తృతంగా విష ప్రచారం చేశాయి. సర్వే చేసి భూ లాగేసుకుంటారని అపోహలు కల్పించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యతిరేకతను పుట్టించాయి. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ రీసర్వే ప్రాజెక్ట్ పేరుతో మండలంలో భూముల సర్వే కార్యక్రమం పునః ప్రారంభించింది.

ప్రతిష్టాత్మకంగా..

గత ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా సమగ్ర భూ సర్వే చేపట్టారు. భూముల సర్వే చేసి, హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఆర్‌వోఆర్ చేపట్టి, నోటీసులు ఇచ్చి, వివాదాలు పరిష్కరించిన తర్వాత గ్రామంలో రైతు పేర ఎన్ని సర్వే నంబర్లలో భూమి ఉన్నా.. ఒకే యూనిక్ ఐడీ, ఖాతా నంబర్‌తో పాస్ పుస్తకం అందజేసేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఎటువంటి భూ సమస్యలకు తావులేకుండా ఆన్‌లైన్ చేసి మండల స్థాయిలో భూ రికార్డులు సమగ్రతను కాపాడే విధంగా చర్యలు తీసుకున్నారు. సమగ్ర భూ సర్వే కొనసాగి ఉంటే ఈ పాటికి మండలంలో సగం గ్రామాల సర్వే పూర్తి అయ్యి ఉండేది.



డ్రోన్ సర్వే ద్వారా భూమి రెక్టిఫైడ్ ఇమేజ్‌కి సిద్ధం చేస్తున్నసర్వే అధికారులు (ఫైల్)

సర్వేలో చేయాల్సి పనులు

గతంలో డ్రోన్ ద్వారా భూమి విస్తీర్ణం సర్వే చేశారు. గ్రామాల్లో భూమి హద్దులు, ప్రభుత్వ భూమి గుర్తించడం, ఆర్‌వోఆర్, అభ్యంతర నోటీసులు ఇవ్వడం, ఆన్‌లైన్ చేయడం, పాస్ పుస్తకాలు జారీ చేయడం రీ సర్వేలో భాగం. రెవెన్యూ కార్యాలయం నుంచి డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్ పర్యవేక్షణలో గ్రామ సర్వేయర్లు 11 మంది, వీఆర్వోలు 8 మంది పనులు పూర్తి చేస్తారు.

రెండు గ్రామాల్లో సర్వే పూర్తి

గత ప్రభుత్వ హయాంలో మండలంలోని 20 గ్రామాలకు గాను రెండు గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తి చేశారు. పీసపాడు (1834.50 ఎకరాలు), పారుపల్లి (539.50 ఎకరాలు)గ్రామాల్లో సర్వే పనులు పూర్తి చేశారు. కొంతమంది రైతులకు పాస్ పుస్తకాలు కూడా వచ్చాయి. గుడిపాడులో 4,516.70, అందుకూరు లో 1,936.35, హసనాబాద్‌లో 1,858.21, దొడ్లేరు (దొడ్లేరు, ఆవుల వారిపాలెం, పెరికపాడు)లో 6,239.36, క్రోసూరులో 5,973.61, ఉయ్యందన 3417.74, 88 త్యాళ్లూరు 3099.70, బయ్యవరం 2894.40, ఊటుకూరు 2842, విప్పర్ల 2002, అనంతవరం 1018.80 ఎకరాలు.. మొత్తం 38,152.87 ఎకరాలకు సర్వే చేయాల్సి ఉంది. పీసపాడు, పారుపల్లి గ్రామాల సర్వే పూర్తికాగా.. మిగిలినది 35,798.87 ఎకరాల భూములు సర్వే చేయాల్సి ఉంది.

రీ సర్వే పనులు ప్రారంభం

మండలంలోని అందుకూరు గ్రామంలో 1,936.35 ఎకరాల హద్దులు గుర్తించే రీ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. బాలమ్రు, అనంతవరం గ్రామాల్లో ఆర్‌వోఆర్ మిగిలి ఉంది. పాస్ పుస్తకాలు ఇవ్వలేదు. ఈ నెల 20 కల్లా మూడు గ్రామాల్లో ఆర్‌వోఆర్ పూర్తిచేస్తాం.

– శ్రీధర్, మండల సర్వేయర్, క్రోసూరు

వివాదాలకు తావు లేదు

సమగ్ర భూ సర్వే చేయడం ద్వారా భూ వివాదాలు అస్కారం ఉండదు. ఆర్‌వోఆర్ నమోదు పూర్తి అయిన తర్వాత భూమి మొత్తం డిజిటలైజ్ చేయటం జరుగుతుంది.

– జింకా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్, క్రోసూరు

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



వడ్డవల్లిలో గోదాదేవి,రంగనాథస్వామి కల్యాణ క్రతువు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి, రైల్వే స్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో సోమవారం కనుల పండువగ గోదాదేవి, రంగనాథుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో శ్రీవారికి సర్వభూపాల అలంకరణ గావించారు. అనంతరం వేద పండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. భక్తులకు రెండు ఆలయాల్లో అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించింది.



సర్వభూపాల అలంకరణలో శ్రీవారు

వైభవంగా గోదాదేవి కల్యాణం

అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రం అమరావతి పాండురంగస్వామి దేవాలయంలో సోమవారం భోగి రోజున గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృత స్నపన నిర్వహించి, స్వామి వారికి విశేష అలంకారం చేశారు. అర్చక స్వామి పరాశరం రామకృష్ణమాచార్యులు గోదాదేవి, పాండురంగ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రముఖ అధ్యాత్మిక రచయిత పీసపాటి నాగేశ్వరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

భోగిలో పెరిగిన విద్యుత్ బిల్లుల దహనం



క్రోసూరులో విద్యుత్ బిల్లుల దహనం



భోగి మంటలో కరెంటు బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అమరావతి/క్రోసూరు: పాత బకాయిల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యుత్తు చార్జీలు పెంచి, ప్రజలపై రూ.16 వేల కోట్ల భారం మోపడాన్ని సీపీఎం నాయకులు ఖండించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ నాయకులు సోమవారం పెరిగిన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. సీపీఎం అమరావతి కార్యదర్శి బి.సూరిబాబు స్థానిక పాత లారీ అఫీస్ సెంటర్‌లో బిల్లులు దహనం చేయగా, మొహిద్దీన్ వలి, పొలు ధారా ప్రసాదు పాల్గొన్నారు. అలాగే క్రోసూరు మండలంలో విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ పలు గ్రామాల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను సీపీఎం నాయకులు దహనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మరింత బాదుడే బాదుడు భారాలు వేసి నడ్డి విరుస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రవిబాబు విమర్శించారు. మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ..తక్షణమే స్మార్ట్ మీటర్ విధానాన్ని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిలుక ఏసయ్య, దుద్దుల ఇశ్రాయేలు, షేక్ జాఫర్, మురళీ, గర్నెపూడి మహేష్, గంజమల ఎలిశమ్మ, గార నాగరాజు, షేక్ కొల్ల శాఖమూరి, మోహన్ రావు, నీరుకొండ కృష్ణ, తిమ్మిశెట్టి కుమారి, ఏపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ బిల్లుల దహనం

సత్తెనపల్లి: పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద సోమవారం వేసిన భోగి మంటల్లో పెరిగిన విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హయాంలో స్మార్ట్ మీటర్లను పెడుతుంటే పగలగొట్టమని పిలుపునిచ్చిన టీడీపీ నాయకులు ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, నాయకులు జి.బాలకృష్ణ, పొట్టి సూర్యప్రకాశరావు, జడ రాజ్‌కుమార్, కట్టా శివదుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, పొట్టి వీరేశం పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సాంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు



ముప్పాళ్లలో భోగి మంటల వద్ద మహిళలు, చిన్నారులు



పాత వస్తువులు వేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



క్రోసూరు: విద్యానగర్‌లో భోగి మంట వద్ద యువత

నకరికల్లు: మండలంలోని పలు గ్రామాల్లో భోగి వేడుకలను ప్రజలు సాంప్రదాయబద్ధంగా సోమవారం జరుపుకున్నారు. తెల్లవారు ఝామునే కుటుంబ సమేతంగా భోగి మంటలు వేశారు. పాత వస్తువులను భోగి మంటల్లో వేసి, కొత్త వెలుగులను ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. నకరికల్లులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చౌత్రా సెంటర్‌లో పెద్ద ఎత్తున భోగి మంట వేశారు.

ఘనంగా భోగి వేడుకలు

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముంగిళ్లలో రంగ వల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ముగ్గులు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్చంపేట: భోగి పండుగ సందర్భంగా స్థానిక సీతారామస్వామి దేవాలయం వద్ద సోమవారం ఆర్యవైశ్య మహిళా విభాగం భోగిమంటలు వేసి, ఆటపాటలతో అలరించారు. యువతులు ముగ్గులు వేసి రంగ వల్లులు తీర్చిదిద్దారు.

ఘనంగా భోగి వేడుకలు

పెదకూరపాడు: మండల వ్యాప్తంగా సోమవారం భోగి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు అందమైన రంగ వల్లులు తీర్చిదిద్దారు. భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగకు వివిధ ప్రాంతాల నుండి నగరవాసులు స్వగ్రామాలకు రావడంతో సందడి నెలకొంది.



నకరికల్లులో భోగి మంట వేస్తున్న యువత

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం నుంచి 16వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు సోమవారం తెలిపారు. గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం, గ్రామోత్సవం, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కల్యాణంలో పాల్గొనదలసిన దంపతులు దేవస్థానంలో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం భక్త చింతామణి నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని కమిటీ చైర్మన్ కోరారు.

ముత్యాలమ్మ తిరుణాళ్లకు అంతా సిద్ధం

రాజుపాలెం: మండలంలోని అనుపాలేనికి తూర్పు వైపున ఉన్న కొండపై కొలువుదీరిన ముత్యాలమ్మతల్లిని.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిటి కొంగు బంగారంగా కొలుస్తారు. ముత్యాలమ్మను జంట గ్రామాలైన అనుపాలెం, అంచులవారిపాలేనికి చెందిన గ్రామస్తులు కుల దైవంగా పూజిస్తారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మంగళవారం తిరుణాళ్ల నిర్వహిస్తున్నారు. పాడి పంటల భోగభాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకు అతీతంగా తొలి ధాన్యపు కంకులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి, బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ ప్రభలు కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అనేక ఉత్సవాలతో రాత్రంతా జాగారం చేస్తారు. ఈ తిరుణాళ్లను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తిరుణాళ్లలో అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ వేణుగోపాల్ ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



కొండపై వెంచేసిన ముత్యాలమ్మ దేవాలయం

ఘనంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వార్షికోత్సవం


సత్తెనపల్లి: మారుమూల ప్రాంతంలో సేవ చేయాలనే భావన ఎడ్వర్డ్ అండ్ సునాబ్రాన్ ఫ్రాన్స్ దేశస్తులకు రావడం అభినందనీయమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ధూళిపాళ్ల సమీపంలోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఎడ్వర్డ్ అండ్ సునా బ్రాన్ నేత్ర వైద్యశాలలో సోమవారం ఘనంగా 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన వినుకొండ, మాచర్ల పరిధిలో మరొక వైద్యశాల నిర్మించాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి నాగేశ్వరరావుని అభ్యర్థించారు. చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లలో 2,57,961 మంది పేషంట్లను చూశామని, వారిలో 26,462 మందికి కంటి ఆపరేషన్లు చేయడం జరిగిందన్నారు. 60 శాతం ఉచిత కంటి ఆపరేషన్లు అని తెలిపారు. వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, డైరెక్టర్ రోహిత్ కన్నా, డాక్టర్ ప్రవీణ్ కృష్ణ, డాక్టర్ బ్రిజేష్ టక్కర్, డాక్టర్ మయాంక్, కల్నల్ ఇన్నా సత్యనారాయణరెడ్డి, చల్లా రత్తయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

దీపాలదిన్నెపాలెంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

సత్తెనపల్లి: అటు సినీ రంగం, ఇటు రాజకీయంలోనూ ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. దీపాలదిన్నెపాలెం గ్రామంలో నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ సోమవారం నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టగలిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అని ఎన్టీఆర్ ఆ రోజుల్లోనే చెప్పారన్నారు. విగ్రహన్ని నెలకొల్పిన నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ నాయకులు ఆళ్ల అమరేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, కోమటినేని శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, వేగుంట రాణి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పక్కన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

శ్రీమద్రమారమణ గోవిందో హరి!

రాజుపాలెం: తలపై అక్షయ పాత్ర, భుజాన తంబుర, చేతిలో చిడతలు మోగిస్తూ, కాళ్లకు గజ్జెల చప్పుడుతో.. ముక్కోటి దేవుళ్లను స్మరిస్తూ, హరినామ సంకీర్తనలు తీస్తు తెల్లవారుజామునే వీధుల్లో హరిదాసులు తిరుగుతుంటే ధనుర్మాసంతో సంక్రాంతి పండగ సందడి మొదలైనట్లు. హరిదాసు అంటే హరి భక్తుడని అర్థం. సాక్షాత్తు శ్రీమన్నారాయణుని స్వరూపమే తానుగా ధరించి, ఆబాల గోపాలాన్ని తన్మయులను చేస్తూ, ఆనంద పరుస్తూ గ్రామ పుర వీధుల్లో తిరుగుతూ ఉంటారు. హరిదాసు తలపై గల నామాలు కలిగిన అక్షయ పాత్ర తరగని సంపదలకు గుర్తుగా భావిస్తారు. త్రిలోక సంచారి విష్ణుమూర్తి భక్తుడైన నారదుల వారే నేటి మన ఈ హరిదాసులుగా గ్రామాలలో ప్రజలు భావిస్తారు. హరిదాసులు వస్తే ఇక ఊరంతా పండగ కళ వచ్చినట్లే. హరిలో రంగ హరి.. అంటూ వీధులు తిరగడం ఆనవాయితీ. వీరికి తోడు గంగిరెద్దుల వారు, కాటికాపరులు, పిట్టల దొరలు, బట్టరాజులు, జంగమదేవర్లు ఇలా అనేక మంది జానపద కళాకారులు గ్రామ వీధుల్లో తిరుగుతూ అందరిని పలకరిస్తూ సందడి చేస్తుంటారు. రైతుల లోగిళ్లు ధాన్యరాశులతో నిండాలని, సుఖసంతోషాలతో వర్ధల్లాలని, ఇలాగే ప్రతిఒక్కరికి దానధర్మాలు చేస్తూ.. చల్లగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఉంటారు. మహిళలు, పిల్లలు ఆనందంగా ఎవరికి తోచిన విధంగా వారు విష్ణుమూర్తి అవతారమైన హరిదాసుకు దానధర్మాలు చేస్తుంటారు.



హరిదాసు పంభా ఏడుకొండలకు బియ్యం వేస్తున్న భక్తురాలు

ఆదరణ తగ్గుముఖం

మండలంలోని రాజుపాలెం గ్రామంలో సుమారు 60 కుటుంబాలకు చెందిన హరిదాసులు జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరి కుటుంబాల్లో ఒకరి నుంచి ఐదుగురు సంక్రాంతి నెలలలో తిరుగుతుండేవారు. అందులో గ్రామానికి చెందిన పంభా ఏడుకొండలు, పంభా వెంకటేశ్వర్లు హరిదాసు చుట్టుపక్కల గ్రామాల్లో దేవుని గీతాలు ఆలపిస్తూ ఇప్పటికీ తిరుగుతున్నారు. ఆదరణ తగ్గుతున్నా.. ఏటా సాంప్రదాయాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో తాము ఈ నెల కఠిన దీక్షతో హరి నామస్మరణం చేస్తూ గ్రామాల్లో తిరుగుతున్నట్లు చెప్పుకొస్తున్నారు.

కఠిన దీక్ష

తెల్లవారు జామునే లేచి స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో నుదిటన నామాలు పెట్టుకొని బయలుదేరుతాం. డిసెంబర్ 16 నుంచి ధనుర్మాసం రాకతో సంక్రాతి పండుగ వరకు గ్రామాల్లో తిరుగుతాం. విష్ణు నామ స్మరణతో వచ్చే మమ్మల్ని భగవంతుడే తన ముంగింట వచ్చినట్లుగా మహిళలు భావిస్తారు. సాక్షాత్తు దేవుడికే కానుకలు సమర్పిస్తున్నట్లు అనుకుంటారు. ఇప్పటికి కొంతమంది మహిళా భక్తులు హరిదాసు పాదాలను నీళ్లతో కడిగి తమ భక్తిని చాటుకుంటారు.

– పంభా ఏడు కొండలు, హరిదాసు, రాజుపాలెం



డూడూ బసవన్నలు, గంగిరెద్దులవారు

సీపీఎం కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



సత్తెనపల్లి: పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం కార్యకర్తలు, ఐద్వా మహిళలు సీపీఎం సింబల్ సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తు ముగ్గుతో చిత్రీకరించి రంగులతో అలంకరించారు. జై జవాన్ .. జై కిసాన్ అని ముగ్గుతో చిత్రీకరించి తమ అభిమానాన్ని చాటారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పొంగలి తయారు చేసి అల్పాహారంగా స్వీకరించి పండుగ చేసుకున్నారు. సీపీఎం ప్రజా సంఘాల నాయకులు గద్దె ఉమాశ్రీ, ధరణికోట విమల, గుంటుపల్లి రజని, ఇంజం అరుణ, మునగా భారతి, పొట్టి సూర్యప్రకాశరావు, డి.పుల్లారావు, సుకన్య, శ్రీరామ్ చరణ్, కిషన్, అక్షయ, జె.అమూల్య, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.